
# సత్యాగ్రహానికి వందేళ్ళు



భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించిపెట్టిన ఆయుధం- సత్యాగ్రహం. ఆ సత్యాగ్రహం ఆవిర్భవించి నేటికి వందేళ్ళు పూర్తయ్యాయి. అప్పటికే కాదు, ఇప్పటికీ ఇదొక శక్తివంతమైన విచిత్ర ఆయుధం. అహింసామార్గంలో సాగే ఈ పోరాటం ఇప్పుడు జాతికి ఆదర్శం. దక్షిణాఫ్రికాలో వందేళ్ళ క్రితం ఒక చిన్న సంఘటనకు ప్రతిగా జోహాన్నెస్‌బర్గ్‌లో గాంధీజీ చేపట్టిన ఈ ఆయుధం, ఏకంగా ఒక దేశానికి స్వాతంత్ర్యం సంపాదించిపెట్టగలదని ఆనాడెవరూ ఊహించి ఉండరు. ఆ దేశంలో పుట్టిన ఈ దేశంలో అడుగుపెట్టిన సత్రాగ్రహ ఆయుధానికి ఇప్పటికీ జాతి జేజేలు పలుకుతోంది.

అహింస సత్యాగ్రహానికి మూలం. ఈ మార్గంలో పయనిస్తే ఎదుటివారు దిగివస్తారా? అనే సందేహం అప్పటి ప్రజలకూ, బ్రిటీష్‌వారికి ఉంది. కానీ దాన్ని ఆచరించి చూపడంలో గాంధీజీ చిత్తశుద్ధి వల్ల సత్యాగ్రహం ఉద్యమ రూపం దాల్చింది. సత్యాగ్రహమనేది నిజానికి అహింస ఒక్కటే కాదు. ఇదొక జీవన విధానం. సత్యాగ్రహమని పేరు పెట్టకముందు నుంచే గాంధీజీ ఆ జీవన విధానాన్ని అనుసరించారు. సత్యాగ్రహానికి మొదట ఉన్న పేరు సదాగ్రహ. ఆ తర్వాత దానికి సత్యాగ్రహమని గాంధీజీ పేరు పెట్టారు. అణచివేతను ఎదురొడ్డడంలో గాంధీజీ అనుసరించిన మార్గం అనూహ్య ఫలితాలను ఇచ్చింది. తర్వాత దేశం యావత్తూ ఈ పేరు ప్రతిధ్వనించింది. ప్రజలదందరూ సత్యాగ్రహాన్ని తమదిగా తీసుకున్నారు. అందుకే సత్యాగ్రహం చాలా శక్తివంతమైన ఆయుధమయ్యింది.

ఆహారాది నియమాలు, బ్రహ్మచర్య దీక్ష, అహింస, వస్త్రధారణ, సత్యవ్రతం ఇవన్నీ కలసే సత్యాగ్రహమయ్యింది. టీ వంటి పానీయాలు తీసుకోవడం, సూర్యాస్తమయిన తర్వాత ఆహారాన్ని తీసుకోకపోవడం వద్ద నుంచి ఆరోగ్యకరమైన జీవనసూత్రాలెన్నో ఇందులో ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ గాంధీ జీవితంలో ఒక భాగమైపోయాయి. సత్యాగ్రహ నిమమాల మూలం ఒక్కటే! ఆచరించేవారిని భౌతిక నాగరికతకు దూరంగానూ, ప్రకృతికి దగ్గరగానూ తీసుకువెళ్ళడం! ఈ జీవన విధానంలో గాంధీజీ సాధించిన విజయం ఆయనదొక్కరిదీ మాత్రం కాదు. ఆయన సహధర్మచారి - కస్తూరి బా సహకారం కూడా ఎంతో ఉంది. అనేక సందర్భాలలో గాంధీ దీనిని అంగీకరించేవారు.

సత్యాగ్రహంలో ఏమేమి ఇమిడి ఉన్నాయో చూడండి-

సత్యవ్రతం:- నీతి నిజాయితీలతో వ్యవహరిస్తూ, దాపరికం లేకుండా నిజం మాట్లాడడం. ఎవరి నమ్మకాలైనా నిజాలను ప్రతిబింబించేవిగా ఉంచుకోవడం. సత్యం మాట్లాడడం అనే విషయంలో నిబద్ధతతో వ్యవహరించడం.అన్ని వేళలలో అహింసను పాటిస్తూ ఎదుటివారిని గౌరవించడం, ఎటువంటి త్యాగాలకైనా సిద్ధం కావడం.

దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడే గాంధీ తన వస్త్రధారణలో మార్పు తీసుకువచ్చారు. ఒక సాధారణ కార్మికుడి వలే ఆయన దుస్తులు ధరించేవారు. తిరిగి వచ్చిన తర్వాత దేశమంతటా తనకొక్కడికే కాక ఎందరికో ఈ ఆయుధాన్ని అందించారు. నిజానికి ఇది ఒక భారతీయ జీవన విధానం. ఆరోగ్యకరమైన దేహంతోపాటు, మనసునూ అందించే ఈ జీవన విధానానికి ఇప్పుడు ప్రజలందరూ దూరమవుతున్నారు. తిరిగి సత్యాగ్రహ విధానాలకు కనీసం వ్యక్తిగతస్థాయిలోనైనా పునరంకితం కావడం మన ధర్మం.